# పిచ్చివాళ్ళ మీద రీసెర్చి చెయ్యాలనే ఆలోచన అతడెందుకు విరమించుకున్నాడు?

## రావులపాటి రాజీవ్‌చంద్ర కథ

## కథాంతం

నేను నిరుద్యోగిగా, పనీపాట లేక పత్రికలకు ఆర్టికల్స్ వ్రాస్తూ కాలం గడుపుతున్న రోజులవి. ఏదో ఒక గొప్ప సెన్సేషనల్ ఆర్టికల్ తయారుచేసి అఖిలాంధ్ర పాఠక లోకాన్ని ఊపివేయాలన్నది నా చిరకాల వాంఛ!

అలా నేను నా వాంఛతో కాళ్ళు వాచేటట్లు రోడ్లపైబడి తిరుగుతుండగ హఠాత్తుగా ఓనాడు నా మదిలో ఓ ఆలోచన మెదిలింది!

నేను పిచ్చివాళ్ళ మీద ఓ ఆర్టికల్ ఎందుకు వ్రాయకూడదు??

అది నిజంగా ఓ పిచ్చి ఆలోచన అని అందరికీ అనిపించవచ్చు. కానీ పిచ్చివాళ్ళ మనోభావాలపై, మనస్సు లోతులపై నేటి వైద్యం మూలంగా వాళ్ళ ఆలోచనా పరిధిలో వచ్చే మార్పులపై కొంత రిసర్చి చేస్తే నిజంగా ఒక గొప్ప ఆర్టికల్ సృష్టించవచ్చని నా హృదయం చెబుతోంది.

ఒకవేళ నా ఊహ తప్పయినా నాకొచ్చిన నష్టమేమీ లేకపోవడంతో నేను మెల్లమెల్లగా నా ఊహారూపాన్ని కార్యరూపంలోకి అనువదించసాగాను.

ఎక్కడెక్కడి లైబ్రరీలకో తిరిగి నా ఆర్టికల్‌కి అవసరమనిపించిన ప్రతి పుస్తకంలోని ప్రతి పేజీలోని ప్రతి అక్షరాన్నీ శ్రద్ధగా చదవసాగాను.

నా ఏకాగ్రతని, నేను చదువుతున్న పుస్తకాలని, చూసి మావాళ్ళు వాటివల్ల నాపై ఎటువంటి 'చెడు ప్రభావం' వుండకుండా, రెండురోజులకోసారి నన్ను మా



ఫామిలీ డాక్టర్ పరీక్షించేటట్టు ఏర్పాటుచేసారు కూడా!

ఇలా ఓ వారం రోజులు గడిచిన పిదప, నేను సేకరించిన సమాచారంతో ఓ పాతిక, ముప్పై పేజీలు నిండాయి. వాటిని ఎల్లప్పుడు ఓ చిన్న సంచీలో నాతో తిప్పసాగాను.

ఆరోజు నాకు అవసరమైందంతా నేను సేకరించేశానని నమ్మకం కుదిరింది. ఇకపోతే

మిగిలిందల్లా ఓ పిచ్చి డాక్టర్‌ని. ఐమీన్... ఓ సైకియాట్రిష్టుని ఇంటర్వ్యూ చేయడం మరియు ఓ పిచ్చివాడితో కొన్నిగంటలు గడిపి, అతడి ప్రతిచర్యనీ పరిశీలించటమే!

ఈ పనులను కూడా ముగించుకుందామని నేనారోజు ఆ హాస్పిటల్‌కి వెళ్ళాను. అక్కడి ఇన్‌ఛార్జి ఆఫీసర్‌ని కలిసి నన్ను నేను పరిచయం చేసుకుని నా పనిని వివరించాను.

అతడు నాతో ఎంతో సావకాశంగా నేటి వైద్యవిధానం గురించి, పిచ్చిలోని రకాలగురించీ, తాము ఎదుర్కొనే సాధకబాధకాలగురించి ఎంతో విపులంగా చర్చించాడు.

ఆ చర్చానంతరం నేను నా చివరి కోరికని విన్నవించగా అతడు అంగీకరించడమేకాక 'మావార్డులో ఓ విచిత్రమైన పేషంట్ వున్నాడు. అతడి ప్రవర్తనలో అప్పుడప్పుడు మతిస్థిమితంలేనట్టు గోచరించినా మిగతా సమయాల్లో అతడు కనిపించిన వారందరికీ ఓ కథ చెప్పి, ఆ కథకి ముగింపు ఏవిధంగా వుంటే బాగుంటుందా? అని అడుగుతూ వుంటాడు. ఈ మధ్యరెండు మూడుసార్లు ఇక్కడినుండి పారిపోవటానికి కూడా ప్రయత్నించాడు. మీరు అతడ్ని కలిస్తే మీకేమైనా ఉపయోగం వుంటుందని నా వుద్దేశం'' అని సలహా కూడా ఇచ్చాడు.

అతడి సలహాకి కృతజ్ఞతలు చెప్పి ఒక బాయ్ నాకు దారి చూపించగా నేను ఆ పిచ్చివాడి గదిలోకి ప్రవేశించాను.

అసలు నా ఈ కథకి ఆరంభం ఇక్కడే అని చెప్పొచ్చు! అతడి గదిలోకి ప్రవేశించిన నేను అతడినే గమనిస్తూ మధ్యమధ్యలో ఎన్నో ప్రశ్నలేయసాగాను. అతడు ఇంచుమించు నా ప్రశ్నలన్నింటికీ అవకతవకగానే సమాధానాలిచ్చాడు. వాటిలో కొన్ని నాకూ, అక్కడే వున్న బాయ్ కి నవ్వుతెప్పించాయి కూడా.

కాసేపయ్యాక తర్వాత అతడే ''నేను నీకో కథ చెబుతాను వింటావా?'' అడిగాడు

అవకాశం కోసమే ఎదురుచూస్తున్న నేను వెంటనే ''చెప్పు వింటాను'' అని అవతలవైపువున్న బాల్కనీ గోడ ఎక్కి కూర్చుని అతడినే గమనించసాగాను.

అతడు చెప్పడం ఆరంభించాడు—

''ఆరోజు ఆదివారం. ప్రొద్దున్నేలేచి నేను పేపర్‌లో 'ఆదివారం అనుబంధం'లోని వారఫలాలను చూసుకున్నాను. నాకారోజు ఎంతో అదృష్టకరమైన దినమని వుంది. ఆరోజు నేను భోజనం చేశాక రామావతారం, శేషగిరి, అప్పారావులతో కలిసి అడవికి వేటకని వెళ్ళాము. నా దగ్గర తప్ప మిగతా వాళ్ళందరి దగ్గరా పెద్దపెద్ద తుపాకులున్నాయి.

మేము అడవి మధ్యలోకెళ్ళేసరికి ఉన్నట్టుండి జీపు పాడైపోయింది. ఇక ఆరోజు వేటచాలని మేము ఇంటిదారి పట్టి వస్తుండగా మధ్యలో మేము దారి తప్పామని గ్రహించి నలుగురం ఓచోట నిలబడ్డాం. అప్పుడు వున్నట్టుండి, తామసలు ఎలా పడ్డామో కూడా తెలియకుండా రామావతారం, శేషగిరి, అప్పారావులు ఓ ఊబిలోకి పడిపోయారు'' అని ఓ నిముషం ఆపి నావైపు తిరిగి అతడు ''ఇప్పుడు చెప్పు

వాళ్ళముగ్గురూ ఎందుకు ఊబిలోకి పడిపోయారు? నేనొక్కడినే ఎందుకు పడిపోలేదు?'' అని అడిగాడు.

ఆ ప్రశ్న నాలో ఎన్నో ఆలోచనలను రేకెత్తించింది. ఆహా... ఏమిరీజనింగు ఆ రోజు అతడికి అదృష్టకరమైన రోజు గనుక చివరికి తన మిత్రులు ముగ్గురూ ఊబిలోకి పడిపోయినా తనుమాత్రం రక్షింపబడ్డాడు. నేటి తెలుగు రచయితలు కూడా తమ కథలని ఇంత అర్థవంతంగా ముగించగలుగుతున్నారని నాకనిపించలేదు.

పిచ్చి తగ్గింతరువాత ఇతడు ఓ గొప్ప రచయిత అవుతాడని అనిపించింది... పిచ్చి తగ్గింతరువాత!... అసలితడికి ఇప్పటికే పిచ్చి తగ్గిందనీ, ఆలోచనా పరిధి పెరిగిందనీ ఎందుకనుకోకూడదు!

కరక్టే! ఇతడికి పిచ్చితగ్గిందీ కాబట్టే ఈ పిచ్చాసుపత్రిలో వుండలేక పారిపోవాలని ప్రయత్నిస్తున్నాడు.


నా ఆలోచనలు పరిపరి విధాల పరిగెడుతున్నాయి. అంతలో అతడు ''వాళ్ళెందుకు పడిపోయారో నేనెందుకు పడిపోలేదో మీరింకా తెలుసుకోలేకపోయారా?''

అతడు నన్నంత చులకన చేసి మాట్లాడటంతో నేను కాస్త కోపం మిళితమైన కంఠంతో ''ఎందుకు తెలియదు. మీకారోజు అదృష్టకరమైన రోజు గనుక మీరు ఊబిలో పడలేదు. వాళ్ళు దురదృష్టవంతులు కాబట్టి పడ్డారు'' అన్నాను.

''తప్పు'' అన్నాడతడు.

''మరి?'' అడిగాను నేను కాస్త ఆశ్చర్య పోతూ. అప్పుడతడు ''వాళ్ళందరినీ నేనే ఆ ఊబిలోకి తోసేశాను, నన్ను తోయడానికి ఎవ్వరూ లేకుండా!'' అని మెల్లగా నవ్వుతూ చెప్పాడతను. అతడు నవ్వుకి నా వళ్ళు జలదరించింది!

అతడి కళ్ళు నేను కూర్చున్న బాల్కనీ గోడవైపే తీక్షణంగా చూస్తున్నాయి.




నేను కూర్చున్నది మూడో అంతస్థులో వున్న అతడి రూంలోని బాల్కనీ గోడపైన!

అంతే!!

అతడి ఆలోచనా పరిధి కథారూపం నుండి కార్యరూపం దాల్చి నన్నాగోడపైనుండి తోసేయక మునుపే నేను, నా పేపర్లన్నీ అక్కడే, ఆ రూంలోనే వున్నాయని కూడా పట్టించుకోకుండా... వెంగున, ఒక్క గెంతులో తలుపుని వేరుకుని బైటపడ్డాను.

ఇంకెప్పుడూ నేను ఆ రూంకిగానీ, అసలు పిచ్చివాళ్ళ జోలికిగానీ పోలేదు. ఎందుకంటే—

నాజీవిత కథ అర్థాంతరంగా, పిచ్చివాడి చేతిలో అంతం కావడం నాకిష్టంలేదు కాబట్టి!!



డిజైన్: ఆర్. రాధాకృష్ణ (హైదరాబాద్)